కొన్ని సూత్రాల్ని ఏర్పరుచుకుంది. వాటికి భిన్నంగా ఎవరైనా ప్రవర్తిస్తే ఆవిడకు ఇట్టే ఆగ్రహం వస్తుంది. మూడ్రోజుల తర్వాత ఉదయం పదకొండు గంటలకు అవుట్‌హౌస్ ముందున్న జామచెట్టునీడన కుర్చీలో కూర్చున్న అకౌంటెంట్ భార్యను అడిగింది లక్ష్మీనారాయణమ్మ.

"ఇంట్లో చాలామంది ఉంటున్నారనుకుంటాను."

"అబ్బే! అంత ఎక్కువమంది ఎవరున్నారు! అందరూ కుటుంబసభ్యులే."

"మా అత్తగారు, మామగారు ఏదో మందులుతింటూ రెణ్ణెల్లపాటు ఇక్కడుంటారు. ఆ పైన వాళ్ళవూరు పోతారు. మిగతా వాళ్ళంతా...."

"మీవాళ్ళేనా?"

"అవును."

"అయిదుగురు పిల్లలున్నారు. ఇద్దరు పిల్లలనే చెప్పారు."

"ఆఁ.... అదా! అవునండి. అందులో ముగ్గురు అమ్మాయిలు. మీతో ఇద్దరు పిల్లలని చెప్పినమాట నిజమేననుకోండి. ఆడపిల్లలసంగతి చెప్పలేదు. వాళ్ళూ మా పిల్లలే అయినప్పటికీ, చూడండీ! ఆడపిల్లలు పర్మినెంట్‌గా ఇక్కడ వుండిపోతారా! పెళ్ళిళ్ళు అయిపోయాక వాళ్ళవాళ్ళ భర్తలతో కాపురాలకు పోతారు కాబట్టి ప్రత్యేకంగా చెప్పలేదు. మరేమీ అనుకోకండి! ఇందులో నేను ఆడిన పెద్ద అబద్ధమూ లేదు...." అంది అకౌంటెంటుభార్య సుతిమెత్తనగా నవ్వుతూ.

లక్ష్మీనారాయణమ్మ ఓ నిమిషంపాటు నిలారిపోయి చూసి, తన ఇంట్లోకి వెళ్ళిపోయింది.

*అద్దె ఇంటికోసం కన్నపిల్లల్ని గురించి అబద్ధం ఆడవచ్చునా!*

---

**మే సంచికలో శ్రీ ఆదూరి వెంకటసీతారామమూర్తిగారి పూర్తినవల**

**ఈశ్వర్ అల్లా తేరేనామ్**

**ప్రచురింపబడుతుంది**

---

# "భో...జనం"

● రాత్రి వెన్నెల్లో, ఆరుబయల్లో-

వంటిమీద చిరుగులు పడ్డ పంచెతప్ప మరే ఆచ్ఛాదనా లేని శ్రీరాములు కుక్కిమంచంలో దొర్లుతూ, కొడుకు 'పెద్దోడు' అడిగిన దానికి దిగులుగా నవ్వాడు. అతడికా నవ్వు ఎన్నో రోజులుగా అలవాటైన నవ్వు.

ప్రక్కనే వున్న గుడిసెవైపు చూసాడు. అతడా యింటిదాని మొగుడు.

అతడి యింటిప్రక్కనే అతడి యింటి వంటివే చాలా గుడిసెలున్నాయి. వాళ్ళందరి బ్రతుకులు ఒకేలా వుండే 'ఫోటోస్టాటు' కాపీలు.

సంపాదించిన రోజే కడుపులోకి కాస్త భోజనం వెళ్తుంది. వారానికి రెండు, మూడు రోజులు పని వుండదు ఒక్కొక్కప్పుడు. అలాంటప్పుడు తమ కెన్నో ఏళ్ళగా అలవాటైన 'ఆకలి వస్తులు' వుంటుంటారు.

అటువంటప్పుడు రేపో, మాపో రెండో, మూడో సంపాదిస్తామని కలలు కని, కడుపాకలి మర్చిపోవటానికి ప్రయత్నిస్తుంటారు పెద్దోళ్ళు.

అది చేతకాని చిన్నోళ్ళు అమాయకంగా వాళ్ళ అయ్యని అడుగుతారు.

"అయ్యా! అన్నం లేదే?"

"అన్నమట్రా, వారారారేయ్! ఇయ్యాళ దేవుడికి దణ్ణమెట్టుకున్నావా?"

'లేద'న్నట్లు అడ్డంగా తల వూపాడు పెద్దోడు.

"అద్గదీ! అందుకే కామోసు దేవుడికి మా చెడ్డ కోపమొచ్చేసి, మన బువ్వని కాస్తా చూసావా, ఆకాశంలో అన్నపు మెతుకులగా యెలా అరెస్టేసాడో! ఆకాశంకేసి చూ(పి)స్తూ, అన్నాడు శ్రీరాములు.

"సుక్కలేనా అన్నం మెతుకులు!" అమాయకంగా అడిగాడు పెద్దోడు.

"అవున్రా, రేపేళమటుకు బువ్వ తిందువులేరా, అమ్మకాడి కెళ్ళి బజ్జో" కొడుకుని అనునయించాడు శ్రీరాములు.

కలలు కంటూ, నిద్రపోయాడు పెద్దోడు. అతడి కలలో కళ్ళముందు కదలాడింది- సత్తుగిన్నెలోని గంజిలో నుండి పైకి చూస్తున్న అన్నపు మెతుకులు.

శ్రీరాములు ఆకాశంకేసి చూస్తూ,

---

'విపంచి'




ఆలోచిస్తున్నాడు_ "రేపెక్కడో ఏదో పని వుందన్నాడు నాగులు. ఆ పని చేసి వచ్చే అయిదో, పదికోనో యింట్లో వాళ్ళకి తిండి పెట్టాలి!"

అతని ఆలోచనలు తలక్రిందులు చేసే సంఘటన అదే సమయానికి ఆవూరి టౌన్‌హాల్లో జరుగుతుంది.

* * *

ఆ వూరి ఎమ్మెల్యేగారు రాజధాని నుండొచ్చి, తన నియోజకవర్గంలో టూర్లేస్తున్నారు.

టౌన్‌హాల్లో ఆయనకి ఏర్పాటు చేసిన అభినందన సభలో దేశంలో పెరుగుతున్న అవినీతిని చెడామడా వాపిక చచ్చే దాకా తిట్టి, అలసిపోయిన తర్వాత అన్నారు. "రేపు ప్రొద్దుటే మన లంచ్ మురికివాడలో".


శ్రీవారి డైలాగ్ వినగానే ఆయనకి ఠిట్టంగా విందు భోజనమిచ్చి, పని పూర్తి చేసుకోవాలనుకున్న వీరహనుమాన్లు కంగారుపడ్డాడు.

ఆ మాట వినగానే వీరహనుమాన్లు లాగానే చాలామంది కంగారు పడ్డారు. ఆ కంగారుపడ్డ వాళ్ళల్లో ఆ వూరి చైర్మన్‌గారొకరు.

"మురికివాడలో ఫెసిలిటీస్ గట్రా వుండవండీ బాబూ!" ఎమ్మెల్యే చెవి దగ్గరకు చేరి, గొణిగారు.

"వర్లేవోయ్, ఫెసిలిటీస్ అంటే మనమేది చూసుకొంటే, అదే ఫెసిలిటీస్. అన్నట్లిదిగో, రేపు మధ్యాహ్నం నే లంచ్‌కెళ్ళినప్పుడు నాతోబాటు బాగా ఫోటోతీసే, ఫోటోగ్రాఫర్లని పంపించాలి" గుసగుసలాడసాగారు ఎమ్మెల్యేగారు.






ఎమ్మెల్యేగారి లంచ్ ఏర్పాట్లకు అప్పటినుండే హడావుడి పడసాగారు అధికారులు.

* * *

"అయ్‌బాబోయ్! ఎమ్మెల్యేగారేటి? మా యిళ్ళకాడ భోంచేయటమేటి!!" గుండెలమీద చేతులేసుకొంటూ, ఒక్కుమ్మడిగా అన్నారు ఆ వాడ ఆడవాళ్ళు.

"ఎవరి పబ్లిసిటీ పాట్లు వాళ్ళవి తల్లీ!" అని మనసులో అనుకొని, "అది కాదమ్మా! కాస్త శుభ్రంగా వుండే యిల్లేదో చెప్పండి, అక్కడే ఎమ్మెల్యేగారి భోజనం ఏర్పాటు చేస్తాం!" అన్నాడు ఆఫీసర్.

"శ్రీరాములు యిల్లు" కొద్దిసేపు తటపటాయింపు తర్వాత ఆ గుంపులో గుసగుసలు వినబడ్డాయి.

* * *

ఆ అధికారి మాటలు విన్న మరుక్షణం వెల్లవేసినట్లు శ్రీరాములు ముఖం తెల్లగా పాలి పోయింది. "ఇప్పుడు ఎమ్మెల్యేగారి తమంటికొస్తే" అతని ఆలోచన పూర్తికాలేదు.

"ఇప్పట్నుండే ఏర్పాట్లవీ మొదలు పెట్టి, సిద్ధంగా వుండండి!" ఆ మురికివాడ వీధులని శుభ్రం చేస్తున్న మున్సిపాల్టీ వర్కర్స్‌కేసి చూస్తూ, అన్నాడు అధికారి.

"కాని మాకాడ పాచి అన్నం, తూరలు తప్ప మరేవి వుండవు. అవి ఎమ్మెల్యేగారెలా తింటారండీ!" భయపడుతూనే, కొంచెం ధైర్యం చేసి, వాళ్ళ ముందుకొచ్చి చెప్పింది లక్ష్మి, శ్రీరాములు భార్య.

"ఆ పాచి అన్నం కూడా లేదు" మనసులోనే గొణుక్కున్నాడు శ్రీరాములు

ఓ క్షణమాలోచించారు. "సర్లే మేం మాంచి మిలట్రీ భోజన హోటల్ నుంచి కోడికూర అవీ తెప్పిస్తాము. కాసేపటికి క్యారియరొస్తుంది.

ఇదిగో, మీరేవో ఒకటి రెండు ముద్దలు నోట్లో పెట్టుకోవాలి, ఫోటో తీసేటప్పుడు! అంతకన్నా ఎక్కువ తింటే కుదరదు. గాజుప్లేట్లు గట్రా పంపిస్తాం. చాలా జాగ్రత్తగా వుండాలి." హెచ్చరించేసి, వెళ్ళిపోయిందా అధికారుల బృందం.

మురికి వాడనంతా శుభ్రం చేసారు. తోరణాలు కట్టారు. "ఎమ్మెల్యేగారికి సుస్వాగతం" అన్న బోర్డులు తగిలించారు.

కాసేపటికి శ్రీరాములు యింటికి కోడికూర క్యారియర్ వచ్చింది. పింగాణీ ప్లేట్లు వచ్చాయి. ఫోటోగ్రాఫర్లు వచ్చారు. వాటితోబాటు ఎమ్మెల్యే గారొచ్చారు.

కోడికూరతో, మంత్రిగారితో ఫోం చేస్తున్న శ్రీరాములు కుటుంబాన్ని చూసి, అసూయచెందిన ఆకలి కుటుంబాలు చాలా వున్నాయా వాడలో.

ఆ పూటకి కడుపునిండింది శ్రీరాములు కుటుంబానికి.

• • •

ఆ రోజు రాత్రి వెన్నెల్లో అరుబయట్లో—

వంటిమీద చిరుగులు పడ్డ పంచె తప్ప, మరే ఆచ్ఛాదనా లేని శ్రీరాములు కుక్కి నులక మంచంలో దొర్లుతూ, ప్రక్కింటి లక్ష్మింపతి అడిగిన దానికి దిగులుగా నవ్వాడు.

లక్ష్మింపతి అన్నాడు. "అదృష్టవంతుడ్రా! కోడికూరతో ఫోంచేసారు".

శ్రీరాములు లక్ష్మింపతికేసి చూసాడు. "ఏం అదృష్టం!!" నిట్టూర్చాడు. "ఇయ్యాళ వున్న పని కాస్త పోగొట్టుకున్నా ఈ ఎమ్మెల్యే వల్ల. ఈ పూటకి కడుపు నింపుకొన్నా, మళ్ళీ పని దొరికేంతవరకూ పస్తులే" వణుకుతున్న స్వరంతో చెప్పాడు.

ఏమీ మాట్లాడకుండా మౌనంగా వెళ్ళిపోయాడు లక్ష్మింపతి.

మంచంమీద పడుకుని, ఆలోచిస్తున్నాడు శ్రీరాములు— రేపు రాత్రికి పెద్దోడు 'అయ్యా, అన్నం లేదే!' అనడిగే ప్రశ్నకు ఏం జవాబు చెప్పాలా అని.



# జీవితపయనం

ఎ.బి.చన్ద్ర



ప్రియమైన రాజ్యలక్ష్మికి

చాలా రోజులయింది కదూ మన మిలా ఉత్తరాలు రాసుకుని. ఎప్పుడో నువ్వు ప్రసవించటానికి వెళ్ళిన రోజుల్లో రోజూ రాసుకునేవాళ్ళం! ఆ రోజులే బాగుండేవనిపిస్తోంది. కాని కాలం చిత్రమైంది కదూ! చిత్రమైన దాని కదలికలో